అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 07 ఫిబ్రవరి 2023

విద్యావాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

పదేండ్ల నుండి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ సింగరేణిలో విద్యావాలంటీర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ కేంద్రి కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం కెహెచ్‌ఎన్ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ ఓపెన్‌కాస్టులో భూ నిర్వాసితులు అన్ని విధాలుగా సహకారం చేశారన్నారు. కానీ యాజమాన్యం వీవీలకు రూ.5 వేలు ఇస్తుందని, దీంతో వారి కుటుంబాలను పోషించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో విద్యావాలంటీర్లు రమేష్, స్వప్న పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


నవతెలంగాణ-ఖానాపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ 3వ వార్డులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు కంటి వైద్య పరీక్షలు చేసుకొని మందులను, కంటి అద్దాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ జన్నారపు విజయలక్ష్మి శంకర్, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో..!

- రాష్ట్ర బడ్జెట్‌పై జనాల్లో చిగురించిన ఆశలు
- నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల మెడికల్ కళాశాలలకు నిధులు
- రుణమాఫీకి నిధులు కేటాయింపుతో రైతుల్లో హర్షం
- సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు
- దళితబంధుకు నిధులతో ఆ వర్గాల్లో సంతోషం

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్ ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. గతేడాది బడ్జెట్‌లో సుమారు రూ.2.56వేల కోట్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం తాజాగా 2023-24 ఏడాదిలో మాత్రం కేటాయింపులు భారీగా పెంచింది. ఈ ఏడాది వార్షిక ఏడాదిలో రూ.2,90,396 కోట్లను కేటాయించింది. ఎన్నికల సంవత్సరం కాబట్టే భారీ స్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని జనాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ రంగాలతో పాటు నీటిపారుదల, విద్యా, వైద్యం తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో మెడికల్ కళాశాలల ప్రారంభానికి నిధులు కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వీటికి అనుబంధంగా ఈ రెండు జిల్లాల్లో నర్సింగ్ కళాశాలలను కూడా మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దళితబంధు పథకానికి నిధులు కేటాయించడంతో ఆ వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నీటిపారుదల రంగానికి కూడా భారీగా నిధులు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు వచ్చే అవకాశం ఉందని జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం భారీగా బడ్జెట్ ప్రవేశపెట్టడమే కాకుండా నిధులు కూడా త్వరగా విడుదల చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. సంక్షేమ రంగాలతో పాటు అభివృద్ధి పనులకు కూడా భారీగా కేటాయింపులు చేయడంతో ఇన్నాండ్లు పడిన అవస్థలు దూరమయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూంలు నిర్మించినా వాటిని అందజేయకపోవడంతో అవి అలంకార ప్రాయంగా ఉండిపోయాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సొంత ఇంటి స్థలం ఉన్న వారికి రూ.3లక్షలు అందజేస్తామని ప్రకటించడంతో అనేక మంది పేదలు ఎదురుచూస్తున్నారు. గతేడాది బడ్జెట్‌లో కూడా కేటాయింపులు చేసినా నిధులు కాకపోవడంతో నిరుత్సాహంతో ఉన్నారు. ఈ ఏడాది సైతం కేటాయింపులు చేయడంతో ఈ సారైనా విడుదలవుతాయని ఆశతో ఉన్నారు. వీటితో పాటు దళితబంధుకు రూ. 17,700కోట్లు కేటాయించడంతో ఆ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 22వేల దళిత కుటుంబాలు ఉండగా.. ఈ దఫా నియోజకవర్గానికి 500కుటుంబాల చొప్పున అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆయిల్‌ఫామ్ సాగు కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించడంతో జిల్లాలో ఇప్పుడిప్పుడే రైతులు ఈ సాగును చేపడుతున్నారు. వీరికి సబ్సిడీల రూపంలో నిధులు అందజేసేందుకు ఉపయోగపడనున్నాయి.

సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం

పథకాలతో పాటు సంక్షేమ రంగానికి కూడా ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు కూడా భారీగా నిధులు కేటాయించింది. దీంతో ఆయా కార్పొరేషన్ రుణాలు, సబ్సిడీల కోసం ఎదురుచూస్తున్న యువత, లబ్దిదారులకు ఈ వార్షిక సంవత్సరంలో లభించే అవకాశం కనిపిస్తోంది. విద్యా వైద్యరంగాలకు కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చింది. విద్యారంగానికి రూ.19,093కోట్లు కేటాయించడంతో మన ఊరు-మనబడి కింద చేపడుతున్న తరగతి గదులు, ఇతర మౌళిక వసతుల కల్పనకు నిధులు అందే అవకాశం ఉంటుంది. వైద్య రంగానికి కూడా భారీగా కేటాయింపులు చేయడంతో పేదలు అధికంగా ఉండే జిల్లావాసులకు మెరుగైన సేవలు లభించేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సొంత ఇళ్లు లేక అనేక ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వ తాజా ప్రకటన వారిలో సంతోషం నింపుతోంది. ముఖ్యంగా ఇటీవల వరదల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం ప్రత్యేకంగా రూ.2వేల కోట్లు కేటాయించడం, వీటితో పాటు పంచాయతీరాజ్, రోడ్లు భవనాలశాఖకు కూడా భారీగా నిధులు కేటాయింపులు చేయడంతో ఉమ్మడి జిల్లాలో ఇది వరకు ప్రారంభమైన రోడ్లతో పాటు కొత్తగా చేపట్టేందుకు అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా నీటిపారుదల రంగానికి రూ.26,885 కోట్లు కేటాయించడంతో చనక కోర్ట, మత్తడివాగు, జగన్నాథ్‌పూర్, ఆడ వంటి ప్రాజెక్టులకు నిధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

అన్నదాతల్లో హర్షం

ప్రభుత్వం రైతుల పంట రుణాలు మాఫీ చేసేందుకు రుణమాఫీ కింద రూ.6385కోట్లు కేటాయించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం కేవలం రూ.25వేల లోపు వారికే రుణమాఫీ చేయడం మిగితా వారిని విస్మరించడంతో రైతులు మాఫీ కోసం గత నాలుగేండ్లుగా ఎదురుచూస్తున్నారు.తాజాగా ప్రభుత్వం నిధులు కేటాయించడంతో ఈ సారి రుణమాఫీ తప్పనిసరిగా అవుతుందని ఆశలు పెట్టుకున్నారు.



అందరికీ సమ్మతమైన బడ్జెట్ ఇది : జోగు రామన్న, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తోంది. గత ఎన్నిమిదిన్నరేండ్ల నుంచి ప్రతి ఏటా ఆదాయాన్ని పెంచుకుంటూ వ్యవసాయం, ఐటీ, పరిశ్రమల రంగాలను అభివృద్ధి చేస్తోంది. సంక్షేమం, అభివృద్ధి రెండు జోడెద్దుల్లాగా ప్రయాణిస్తున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చేలా ఉంది. హౌసింగ్, న్యూట్రిషియన్ కిట్లు తదితర పథకాలన్నింటికీ నిధులు కేటాయించింది. అందరికీ సమ్మతమయ్యే బడ్జెట్ ఇది.

నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు : సాజిద్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తామని బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్కరికి ఇవ్వలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ విషయం ప్రస్తావన లేదు. మైనార్టీల సంక్షేమ కోసం కేటాయింపులు చేస్తున్నారు కానీ నిధులు ఖర్చు చేయడం లేదు. అన్ని రంగాలకు ఇదే పరిస్థితి ఉంది. ఇది పూర్తిగా విఫల బడ్జెట్.

కేటాయింపులు చేస్తున్నా ఖర్చు చేయడం లేదు : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం ఆయా సంక్షేమ రంగాలకు భారీగా కేటాయింపులు చేస్తున్నా..నిధులు విడుదల చేసి ఖర్చు చేయడం లేదు. కిందటేడాది దళితబంధు కోసం రూ.17,400కోట్ల వరకు కేటాయించారు. కానీ ఖర్చు చేయలేదు. మరోపక్క పరిశ్రమల శాఖ నుంచి తీసుకున్న రుణాలకు మూడేండ్లుగా సబ్సిడీలు రావడం లేదు. వీటితో పాటు దళితబస్తీ పథకం కూడా పురోగతిలో లేకుండా పోయింది. కేటాయింపులతోనే సరిపెట్టకుండా తప్పనిసరిగా వాటిని ఖర్చు చేసి పేదలకు ప్రయోజనం చేకూర్చాలి.

హాత్ సే హాత్ జోడో యాత్రకు శ్రీకారం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో హాత్ సే హాత్ జోడే అభియాన్ యాత్రకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని శ్రీకారం చుట్టారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పిలుపు మేరకు హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించామన్నారు. గత ప్రధానులు దేశానికి సంపదను సృష్టిస్తే ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ దేశ సంపదను ప్రయివేటు వ్యక్తులకు అమ్మి దేశ సంపదను విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో అంటే ప్రధానీ నరేంద్ర మోడీ బేస్‌దో అంటూ ప్రజల ఆస్తులు అమ్ముతున్నారని సీనియర్ నాయకుడు జువ్వాడీ అనిల్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లావుడ్య రమేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరస్వతి, గణేశ్ రాథోడ్, సీహెచ్ వసంత్‌రావు, శేషారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, సర్పంచ్ మనెం కార్తీక్, పెద్దింటి శ్రీకాంత్, జిల్లా యూత్ అధ్యక్షుడు గుండా శ్యాం, మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గంటుమేర, ఆసిఫాబాద్ అధ్యక్షుడు మసాడె చరణ్, శివనాయక్, గుర్లె రాంచందర్, ముంజం వినోద్, ఇగురపు రవి, సాగర్, భీంరావు, ఆనంద్‌రావు, సీహెచ్ తిరుపతి, జిల్లెల స్వామి, పూదరి హరీష్, డి మల్లయ్య, కార్తీక్, వనమాల మురళీ, దుర్గం కళావతి, దత్తు, మడిపల్లి శ్రీను, మొండయ్య చౌదరి, మనోహర్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ భవనం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ నూతన భవనాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత శిలాఫలకాన్ని ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ ఈ డిఫెన్స్ ముఖ్య ఉద్దేశం బాధితులు ఎవరైన అడ్వకేట్‌ను పెట్టుకోలేని పరిస్థితుల్లో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యాలయాన్ని సంప్రదిస్తే బాధితులకు సరైన సలహాలు, సూచనలు చేస్తారన్నారు. తెలంగాణలోని 14 జిల్లాలో డిఫెన్స్ అకాడమీ కౌన్సిల్ ప్రారంభించామని, అందులో ఆదిలాబాద్ జిల్లా ఒకటని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి ప్రమీల జైన్, మంజుల, యశ్వంత్ సింగ్ చౌహన్, ఏఎస్పీ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్నాల నగేష్, పిపిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గంగాపూర్ ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

నవతెలంగాణ-రెబ్బెన

గంగాపూర్ జాతర మహోత్సవానికి వేలాదిగా యాత్రికులు తరలొస్తున్నారు. బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరలో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. సోమవారం సైతం భారీ సంఖ్యలో యాత్రికులు తరలొచ్చారు. తెలంగాణలోని రెండవ తిరుపతిగా పేరుగాంచిన గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు వస్తున్నారు. దీంతో గంగాపూర్ అంతా భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సీ దండె విఠల్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎస్పీ సురేష్‌కుమార్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



నవతెలంగాణ-ఖానాపూర్

అటవీ సంరక్షణ నియమాలు 2022 వెంటనే ఉపసంహరించుకొని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కె సర్దార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం 2006 ఆమోదించి 2సంవత్సరాలు దాటినా దేశంలో ఇంతవరకు ఏ రాష్ట్రంలో కూడా సరిగా అమలు కాకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో గతంలోనూ, ఇప్పుడు కూడా చట్టం సరిగా అమలు జరగలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి మోడల్‌గా పెద్ద ఎత్తున కెసిఆర్ ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ చేసిన వాగ్దానాలు అమలు చేయాలని కోరామని, ఆచరణకు అమలు కానీ ఏమీ కోరడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జె రాజు, ఉపాధ్యక్షుడు గోపి నర్సయ్య, సహాయ కార్యదర్శి మంచుకంటి లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సునారికారి రాజేష్, దుర్గం లింగన్న, గోనె స్వామి, రేగుల గంగన్న, గుట్ల ప్రసాద్, మేడి శంకర్, సిలివేరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

నవతెలంగాణ-కౌటాల

క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని తాటిపెల్లి గ్రామంలో కబడ్డీ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, క్రీడాకారులు ఈర్ష్యాద్వేషాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో క్రీడలు ముగించుకోవాలన్నారు. ఓటమి గెలుపుకు నాందన్నారు. గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో ఉన్నతస్థానానికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో తాటిపెల్లి సర్పంచ్ సోయం సురేష్, మొగడ్‌దగడ్ ఎంపీటీసీ బొమ్మకంటీ మనీష్, క్రీడాకారులు, కబడ్డీ టోర్నమెంటు నిర్వాహకులు ఉన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగం పట్ల కేంద్రం నిర్లక్ష్యం

- నూతన పర్యావరణ చట్టంతో ఆదివాసులకు నష్టం
- టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు
- ఘనంగా ముగిసిన టీఏవీఎస్ రాష్ట్ర మహాసభలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యం కనబర్చిందని భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు అన్నారు. విద్యకు 10శాతం కేటాయించాల్సి ఉండగా 2శాతానికి కూడా పెంచడం లేదని మండిపడ్డారు. విద్యను కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ దిశగా కేంద్రం మార్చేస్తుందని ఎన్ఈపీని ఇందుకే తీసుకొచ్చారని పేర్కొన్నారు. నూతన పర్యావరణ చట్టం తీసుకొచ్చి ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) రాష్ట్ర మహాసభలు సోమవారం రెండో రోజు స్థానిక జనార్దన్‌రెడ్డి గార్డెన్‌లో ప్రతినిధుల సభను నిర్వహించారు. ఉదయం సభా ప్రాంగణంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన వక్తగా మిడియం బాబురావు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద భావాలు వ్యాప్తి చేసేందుకు పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తోందని వ్యాఖ్యానించారు. గాంధీ, నెహ్రూ, భగత్‌సింగ్, అంబేద్కర్ జీవిత చరిత్రలను చదువాల్సిన చోట ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన వారి చరిత్రలు చదివిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీల్లో ఇప్పుడిప్పుడే వెనుకబడిన తరగతుల పిల్లలు చదువులు సాగిస్తుండగా కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా యూజీసీ నిధులను తగ్గిస్తోందని మండిపడ్డారు. పరిశోధనలకు డబ్బులు కేటాయించడం లేదని తెలిపారు. కేంద్రం ఆదివాసీ విద్యార్థుల బతుకు మార్చే ప్రయత్నం చేయకుండా వారిని విద్యకు దూరంచేసేలా వ్యవహరిస్తోందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉన్నప్పటికీ అలాంటి పరిస్థితులు కనిపించడం లేదని తెలిపారు. రేషనలైజేషన్ పేరిట బడులను మూసి వేసి ఆదివాసీ గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందని పేర్కొన్నారు. పేదలకు ఉపయోగపడే మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మెస్రం రాజు, పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, లంక రాఘవులు, టీఏవీఎస్ నాయకులు పాల్గొన్నారు.





సుమన్‌కు లంబాడా నాయకుల కృతజ్ఞతలు



నవతెలంగాణ-భీమారం

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బంజారుల బాంధవుడిలా నిలిచిపోతాడని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడడు, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుక్య రాజ్‌కుమార్ నాయక్ అన్నారు. సోమవారం గ్రామస్తులతో కలిసి హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో సుమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో లంబాడీ కులస్తుల ఆరాధ్య దైవంగా కొలిచే సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

సరైన రోడ్డు సౌకర్యం లేక నరకయాతన



నవతెలంగాణ-రెబ్బెన

గంగాపూర్ జాతరకు స్థానిక ప్రజలతో పాటు చుట్టు పక్కల జిల్లా వాసులు, ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధిలో మాత్రం ఆమడదూరంలో ఉందని చెప్పవచ్చు. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు జరిగే జాతరకు వచ్చే భక్తులు అసౌకర్యాలతో దేవుడిని దర్శించుకుంటున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చే వారికి రోడ్డు సౌకర్యం లేక చిన్నపిల్లలతో పాటు రెండు, మూడు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కొని నరకయాతన అనుభవిస్తున్నారు. గతంలో సాక్షాత్తు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి రెండు వరుసల రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు పురోగతి లేదని భక్తులు అంటున్నారు. ఆదివారం రథోత్సవం జరిగిన తర్వాత ట్రాఫిక్‌లో భక్తులు ఇరుక్కొని దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు నరకయాతన అనుభవించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు రైల్వేగేటు నుండి కాకుండా సింగరేణి బొగ్గుయార్డు నుండి తరలించడంతో భక్తులకు దారి కనబడక దుమ్మూ దూళితో నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎంతో ప్రసిద్ధిగాంచిన రెండో తిరుపతిగా పేరుపొందిన గంగాపూర్ జాతరకు రెండు వరుసల రహదారి నిర్మించి, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని యాత్రికులు కోరుతున్నారు.

నూతన డీజీపీని కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపి అంజనీ కుమార్‌ను ఎమ్మెల్యే ఆత్రం సక్కు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా పలు విషయాలను డిజిపి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన బెటాలియన్ సత్తుపల్లిలో పని చేస్తున్న పూర్వ ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ పోలీస్ ఉద్యోగులను సొంత జిల్లాకు బదిలీ చేయాలని కోరారు. గిరిజన బెటాలియన్‌లో పనిచేస్తున్న వారికి కూడా విద్యార్హత, సీనియారిటీని బట్టి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత పోలీస్ ఉద్యోగాలను స్థానిక ఆదివాసీ అభ్యర్థుతో భర్తీ చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ శాఖ ద్వారా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. నూతన మండలం గాదిగూడకు పోలీస్‌స్టేషన్ భవనం మంజూరు చేయాలని విన్నవించామని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి (కె) గ్రామంలో సోమవారం మండల బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. జక్కి కిష్టన్న తల్లి శనివారం మృతి చెందగా, పోతుగంటి సతీష్, నాగుల నారాయణ తల్లి ఇటీవల మరణించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేశం రమేష్, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, శాతం గంగారాం, ఎంపీటీసీ రమ ముత్యం, వీడీసీ సభ్యులు రవీందర్, భూమారెడ్డి, సాయన్న, మల్లేష్, గంగారాం, చిన్నరెడ్డి పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 07 ఫిబ్రవరి 2023

ట్రాఫిక్ సీఐగా అశోక్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణ ట్రాఫిక్ సీఐగా ఎం.అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలు స్వీకరించారు. 2009లో పోలీస్ శాఖలో చేరిన ఆయన 2020లో సీఐగా పదోన్నతి పొంది స్టేట్ ఇంటెలిజెన్సీ బ్యూరోలో విధులు నిర్వహించారు. మల్టీ జోన్ వన్ ఐజీ చంద్రశేఖర్ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్పీకి రిపోర్టు చేశారు.



అన్ని వర్గాల కలలు సాకారం చేసే బడ్జెట్ : మంత్రి ఐకేరెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

అన్ని వర్గాల కలలను సాకారం చేసేలా, తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బడ్జెట్ 2023-24ను రూపొందించారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తూ వ్యవసాయంతో పాటు సంక్షేమానికి కూడా పెద్ద పీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ఉందని తెలిపారు. రైతుల రుణమాఫీ పథకానికి రూ.6,385 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రైతుల పక్షనా సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పేదలపై భారం పడకుండా పిల్లల చదువులు, ఆరోగ్య సంరక్షణ కోసం విద్య, వైద్యానికి నిధుల కేటాయింపులో ప్రాధన్యతనిచ్చిందని వెల్లడించారు. అదేవిధంగా దేవాలయాల అభివృద్ధి కోసం దేవాదాయ శాఖకు రూ.368 కోట్లు కేటాయించారని అన్నారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావుకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో పాటు చదువులో రాణించాలి

నవతెలంగాణ-బోథ్

క్రీడలతో పాటు చదువులో రాణించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని సాకెర గ్రామంలో విష్ణు యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో ముందుండాలని సూచించారు. క్రికెట్ పోటీలలో దాదాపు 50 టీమ్‌లు పాల్గొనడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, బోథ్, గుడిహత్నూర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు తిరుమల్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు జుగాది రావు, కొడప విజయ్, పెందూర్ లింగు, రాథోడ్ భీమ్‌రావు, ధరావత్ రమేష్, నానాజీ, బాబా నాయక్, పండిట్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను గిరి యువత సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ఉచిత శిక్షణను గిరి యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్, ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి కె.వరుణ్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన సాంప్రదాయ, ఆదివాసీ కళా, చిత్రకళలు, గోండి పెయింటింగ్స్ నందు గిరియువతకు 2 నెలలు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు ఎస్సెస్సీ పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో ఉట్నూరు కేబి కాంప్లెక్స్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల10న హాజరు కావాలని కోరారు. శిక్షణ అనంతరం వివిధ ప్రయివేటు సంస్థలలో ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉచిత శిక్షణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ జాబ్ జిల్లా మేనేజర్ 9032383999ను సంప్రదించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ఆదిలాబాద్ జెడ్పీచైర్మెన్ జనార్ధన్ రాథోడ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలోని పలు సమస్యలపై చర్చించారు. వారి వెంట జెడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు తాటిపల్లి రాజు, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, పవార్ సతీష్, మెస్రం శేఖర్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని తంతోలి గ్రామంలో సోమవారం సీసీరోడ్డు పనులను సర్పంచ్ మడవి లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటినుండి అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సేవ్వ జగదీష్ యాదవ్, భీంరావు, మార్కెట్ డైరెక్టర్ ఫిరంగి మల్లేష్. కరోబారి సురేష్ పాల్గొన్నారు.

చికిత్సతో కుష్టు నివారణ సాధ్యం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

చికిత్సతో కుష్టు నివారణ సాధ్యమవుతుందని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం కుష్టు నివారణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులకు కుష్టు నిర్మూలన, ప్రథమ చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులచే కుష్టు నిర్మూలన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోతుగంటి లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని సోమవారం లింగుగూడ గ్రామం పంచాయతీ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వైస్ ఎంపీపీ జంగు పటేల్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని లింగుగూడ గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, కంటి వైద్య శిబిరం బృందం పంచాయతీ సెక్రటరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి రేవులో ఘనంగా తెప్పోత్సవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపెల్లి గోదావరి రేవులో సోమవారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం శివరాత్రి పర్వదినానికి ముందు వచ్చే సోమవారాలలో ప్రతియేట ఈ తెప్పోత్సవం నిర్వహిస్తారు. పాడిపంటలకోసం నదీజలాలు ఉపయోగ పడినందుకు కృతజ్ఞతగా గౌరీమాతకు పూజ చేసి, ఇంటిల్లిపాదిని నీటి గండం, తదితర ప్రమాదాల నుండి రక్షించి, చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ ఉత్సవంలో ఆయ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌లో ఎంపిక కాలేదని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

అగ్ని పథ్ ఉద్యోగంలో ఎంపిక కాలేదని మనస్తపం చెంది యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన చౌదరి కార్తిక్(21) పోలీస్ ఉద్యోగం చేయాలనే ధృడ సంకల్పంతో ఇంటర్మీయట్ పూర్తి చేసి, అప్పటి నుంచి కృషి చేసేవాడు. గతంలో కూడా ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్మీ రిక్రూట్‌మెంట్ తీసివేయడం గత ఆరు నెలల క్రితం అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌లోని ఈవెంట్స్‌లో ఎంపికయ్యాడు. అనంతరం రాతపరీక్షలో ఎంపిక కాలేదని మనస్థాపం చెంది సోమవారం పంట చేనులో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకొని అపస్మారక స్థితిలో పడి ఉండటంతో కుటుంబీకులు గమనించి, చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. పోలీసు ఉద్యోగిగా చూస్తామని అనుకొన్న కొడుకు ఇలా మరణిస్తాడని అనుకోలేదని కుటుంబీకులు, తోటి మిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని తండ్రి మోహన్ ఇచ్చిన పిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పకడ్బందీగా, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని అన్నారు. ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం చేపట్టాలని అన్నారు. రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసుకున్న అర్హత కలిగిన ఉపాధ్యాయుల బదిలీలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, దరఖాస్తు చేసుకున్న వారి కోరిక మేరకు ఖాళీలను అనుసరించి బదిలీలు చేపట్టాలని సూచించారు. సీనియార్టీ విషయంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, దరఖాస్తుదారునికి పూర్తీ సమాచారాన్ని రాత పూర్వకంగా అందించాలని అన్నారు. బదిలీల నేపథ్యంలో పదోతరగతి విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. పదోతరగతిలో 35 శాతం, 50 శాతం లోపు మార్కులు కలిగిన సబ్జెక్టు వారీగా విద్యార్థులు వివరాలను అందించాలని అన్నారు. అదేవిధంగా ఈ విద్య సంవత్సరంలో పదో



తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఏ ఒక్కరూ కూడా ఫెయిల్ కాకుండా ముందస్తు, రివిజన్ నిర్వహించాలని సూచించారు. పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 9.5, 10 గ్రేడ్ ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా ప్రధానోపాధ్యాయులు హామీ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశం లో డీఈఓ టి.ప్రణీత, సెక్టోరల్ అధికారులు నర్సయ్య, నారాయణ, సుజత్ ఖాన్, ఉదయశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన్‌ల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా..

- జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రధాన్‌ల ధర్మ గురువు హీరాసుక జయంతి వేడుకలను ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారి సాంస్కృతి సాంప్రదాయాల ప్రకారం హీరాసుక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మెన్ మాట్లాడారు. ప్రధాన్ సమాజం సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా నడిచే సమాజమని కొనియాడారు. హీరాసుక జయంతి ప్రతి వాడ వాడల నిర్వహించుకోవాలని సూచించారు. ప్రధాన్ సమాజ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. దానిలో భాగంగా ఉట్నూర్, చాందూరి గ్రామాల్లో కమ్యూనిటీ భవనం కోసం రూ.5.2 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని గుర్తుచేశారు. ఇంద్రవెల్లిలో హీరాసుకకు 4 ఏకరాల స్థలం, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. ప్రధాన్ లకు పీవీటీజీలో చేర్చాలని కోరారు. విషాయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళతానని హామీనిచ్చారు. రాష్ట్ర మహిళా సంఘం సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి మాట్లాడుతూ హీరాసుక జయంతి ప్రతియేటా నిర్వహించుకోవడం సంతోషదాయకమని అన్నారు. సమాజాభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మెన్ మారుతి డోంగ్రె, గెడాం సుమన్, దీపక్ సింగ్ షేకావత్, గెడాం నిరంజన్, దాదే రావ్, గెడాం భారత్, మరప రాజు, అర్క ఖమ్ము పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి, చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. అంగవైకల్యం కలిగిన వారికీ సదరం సర్టిఫికెట్‌లు, పెన్షన్‌లు, కుటుంబ, భూసమస్యలు, దళిత బస్తీ, యాదవులకు గొర్రెల పంపిణీ, ఉపాధి అవకాశాలు, తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన అర్జీలను ఆయా శాఖాధికారులు ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం, అర్హతల మేరకు అర్జీదారునికి సమస్య పరిష్కారం అయ్యే విధంగా ప్రతిపాదించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీదారునికి తన దరఖాస్తుకు సంబంధించిన సమాచారాన్ని రాత పూర్వకంగా స్పష్టమైన వివరణతో సమాచారాన్ని అందజేయాలని అన్నారు. ఒకే సమస్యపై అనేకమార్లు దరఖాస్తుదారుడు ప్రజావాణికి రాకుండా చూడాలని తెలిపారు. ప్రజావాణిలో జిల్లా అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ అన్నారు. ప్రతి నెల మూడో తేదీన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఒక వేళ ఆ తేదీన సెలవుదినం ఉంటే మరుసటి రోజు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా అధికారులు సమన్వయ సహకారంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ ఉద్యోగులుగా విధినిర్వహణలో సకాలంలో సమిష్టి బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించే విధంగా అధికార యంత్రాంగం ఒక టీమ్ వర్క్‌గా పనిచేసి జిల్లాను అన్ని రంగాలలో ముందు వరుసలో నిలుపాలని అన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చే దరఖాస్తుల సంఖ్య తగ్గించాలని, దరఖాస్తుదారులు ఒకే సమస్యపై పలుమార్లు ప్రజావాణికి రాకుండా ఒకేసారి పూర్తీ సమాచారంతో దరఖాస్తుదారుని సమస్య ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సంపూర్ణ



సమాచారంతో దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని సూచించారు. దరఖాస్తుదారుని సమస్య పరిష్కారం అవుతుందా లేదా అనే సమాచారాన్ని రాత పూర్వకంగా అందించాల్సిన బాధ్యత ఆయా శాఖాధికారులపై ఉందని అన్నారు. సంక్షేమ శాఖల సహకారంతో ఉపాధి కల్పన అవకాశాలను సాధ్యమైనంత వరకు కల్పించాలని అన్నారు. ప్రతి మాసం మూడవ తేదీన నిర్వహించే సమావేశంలో వివిధ శాఖలు ప్రతి మాసం నిర్వహించే సమావేశాలను ఆదే రోజున నిర్వహించాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లకూడదని అన్నారు. బుధవారం రోజున జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు, అట్టి సమావేశంలో గత రెండు సంవత్సరాలలో చేపట్టిన ప్రగతి నివేదికలను సమర్పించాలని అన్నారు. అదేవిధంగా గురువారం రోజున ఐటీడీఏ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై ఉట్నూర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

9న హైదరాబాద్‌లో మహాధర్నాను జయప్రదం చేయాలి

- ప్రజా సంఘాల పోరాట వేదిక పిలుపు



నవతెలంగాణ-భైంసా

ఇండ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పోరాటవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఐబీ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఏ ఒక్క రూపాయి ఇవ్వలేదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ పేరుతో 8 సంవత్సరాలు గడిపి అక్కడక్కడ కొన్ని నిర్మాణం చేసి, నేటికీ వాటిని సరిగా పంచకుండా ప్రభుత్వం మొండి వైఖరి వహిస్తుందన్నారు. వెంటనే నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని అన్నారు. ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇవ్వాలని ఇంటి స్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ పోశెట్టి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎం. కృష్ణదాస్ తెలంగాణ రైతు సంఘం భైంసా మండల అధ్యక్షులు భీమ్‌రావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల సంఘాల ధర్నా

- మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఇచ్చోడ

రైతులు పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర రూ.15 వేలు కల్పించాలని కోరుతూ రైతు సంఘాల నాయకులు సోమవారం మండల కేంద్రంలోని రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న మాట్లాడుతూ రైతులు రాత్రనకా పగలనకా కష్టపడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పత్తికి రూ.15 వేలు గిట్టుబాటు ధరతో సీసీఐ ద్వారా కొనుగోలు చేయించాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా పత్తి పంట క్వింటాలుకు రూ.2వేలు బోనస్ ప్రకటించి, పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సతీష్, భూమన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్ జాదవ్, ఆడే గజేందర్, వన్నెల అశోక్, బ్లాక్



కాంగ్రెస్ అధ్యక్షులు మహమూద్ ఖాన్, మండలాధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, జెడ్పీటీసీ నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వరల్డ్ విజన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాబాపూర్ గ్రామంలో బాల్య వివాహలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వరల్డ్ విజన్ సంస్థ ప్రతినిధి బ్రహ్మన్న బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలు గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా వరల్డ్ విజన్ సంస్థ సేవలను స్థానిక సర్పంచ్ శ్రీ విద్య కొనియాడారు. మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. బాల్య వివాహల నివారణకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ సంస్థ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిష్టయ్య, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

9న మైనార్టీల చేయూత పథకానికి లక్కీడ్రా

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఆర్థిక సాయం అందజేయుటకు 2022-23 సంవత్సరానికి గాను అల్ప సంఖ్యకవర్గ లబ్దిదారులు ఆర్థిక సాయం పొందుటకు ఓబీఎంఎంఎస్ ద్వారా 138 మంది లబ్దిదారులు ధరఖాస్తులు చేసుకున్నట్లు సోమవారం ఎంపీడీఓ కావల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటి వరకు 48 మంది లబ్దిదారుల ధరఖాస్తులు ఎంపీడీఓ కార్యాలయానికి అందాయని తెలిపారు. మండలానికి రెండు యూనిట్లు మంజూరైన సందర్భంగా లబ్దిదారులు అందజేసిన ధరఖాస్తుల పరంగా ఈనెల 9న మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 12 లకు లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ధరఖాస్తు చేసుకున్న మైనార్టీ లబ్దిదారులు లక్కీడ్రాలో పాల్గొనాలని కోరారు. నేడు నిర్వహించే లక్కీడ్రా అదిలాబాద్ జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఉండటం వలన నేటి లక్కీడ్రా రద్దు చేసి 9వ తేదీన నిర్వహించడం జరుగుతుందని మైనార్టీ లబ్దిదారులు గమనించాలని కోరారు.

పెరిగిన వేతన జీఓ విడుదల హర్షణీయం

నవతెలంగాణ-నిర్మల్

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓను విడుదల చేయడం హర్షణీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఐటీయూ, కార్మికుల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచడం జరిగిందన్నారు. అలాగే మార్కెట్ ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన సంబంధిత సరుకులకు బిల్లులు పెంచి ఇవ్వాలని, కోడిగుడ్లను, గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుల సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ కనక భీంరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ దరఖాస్తులను అందజేశారు. జన్నారం మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన పవార్ దినేష్ రైతుబంధు ఇప్పించాలని కోరారు, అదే గ్రామానికి చెందిన కొడప అయ్యుబాయి ఆర్ఓఎఫ్ఆర్ వ్యవసాయ భూమికి విరాసత్ పట్టా మంజూరు చేయాలని, నార్నూర్ మండలం బాబేఝరి గ్రామానికి చెందిన కుర్సంగ కర్ణుబాయి గిరి వికాసం పథకం కింద బోరుబావి, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని కోరారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించిన ఏపీఓ శాఖల వారిగా కేటాయించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ గిరిజన దర్బార్‌లో పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏఓ రాంబాబు, జెడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, హెచ్ఓ సుధీర్, డీపీఓ ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-తలమడుగు

జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాహూల్ రాజ్‌ను పలువురు మండల ప్రజా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కలెక్టర్‌ను కలిసిన వారిలో తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, మాధవ్, రుయ్యాడి రమేష్ రెడ్డి, సుంకిడి వెంకన్న, మాజీ జెడ్పీటీసీ బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మెన్ ప్రకాష్ రావు, పోతయ్య, వినోద్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల విభాగం

నవతెలంగాణ-ముథోల్

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కే.శ్యాంసుందర్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఫిర్యాదుల నిర్వహిస్తున్నామని అన్నారు. అర్జీదారుల సమస్యలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీల రూపంలో అందిస్తే పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, మండల విద్యాధికారి జి.మైసాజీ, ఎస్టీఓ సత్యనారాయణ, ఏఓ అజ్మీర భాస్కర్, ఇరిగేషన్ ఏఈ రమేష్, ఏఈ దేశెట్టి అరుణ్, ఏపీఎం అశోక్, పశువైద్యాధికారి రాజేష్, పంచాయతీ, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పదో రోజుకు చేరిన రిమ్స్ నర్సుల సమ్మె

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. కాగా రిమ్స్ ఇన్‌చార్జీ డైరెక్టర్ అశోక్‌తో నర్సులు యూనియన్ సభ్యులు చర్చలు జరిపారు. నర్సులను సమ్మె విరమించాలని కోరగా తమ పెండింగ్ వేతనాలు చెల్లించేంత వరకు సమ్మె విరమించమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సులు 42 మంది ప్రభుత్వ కాంట్రాక్టులో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఫ్రంట్ లైన్ వారియర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని అన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం వీరితో వెట్టి చాకిరీ చేయించుకుంటుదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. 11వ పీఆర్సీ విషయంలోనూ సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వీరికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వీరందరూ ఇతర ప్రాంతాల జిల్లాల నుండి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్నారని అన్నారు. గత పది రోజుల నుండి సమ్మె చేపడుతున్న కూడా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు రాజ్యలక్ష్మి, వనజ, చంద్రకళ, పుష్పలత, వెంకటలక్ష్మి ఉన్నారు.

బడిన మానేసిన పిల్లల వివరాలు సేకరించాలి

నవతెలంగాణ-తాండూర్

మధ్యలో బడి మానివేసిన పిల్లల వివరాలను సేకరించి వారిని స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లలో చేర్చాలని జిల్లా సెక్టోరల అధికారి శ్రీనివాస్ సూచించారు. సోమవారం జడ్పీహెచ్ఎస్ తాండూర్ పాఠశాలలోని స్పెషల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు పిల్లల చదువుపై ఆసక్తి కలిగేలా అవగాహన కల్పించాలన్నారు. గుర్తించిన పిల్లలను స్పెషల్ ట్రైనింగ్ సెంటర్‌లో తరగతులు నిర్వహించి వారి స్థాయిని గుర్తించి చదువులో కొనసాగే విధంగా స్ఫూర్తి నింపాలన్నారు. అనంతరం మన ఊరు-మన బడి పథకంలో భాగంగా పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలతకు సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, సీఆర్‌పీ శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల ప్రారంభం

నవతెలంగాణ-తాండూర్

మండలంలో ఉపాధి హామీ పనులను సోమవారం ప్రారంభించినట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ నందకుమార్ తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు గాను రాజీవ్ నగర్ ద్వారకాపూర్ పంచాయతీ మినహా అన్ని గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఆయా గ్రామపంచాయతీలలోని హ్యాబిటేషన్లలో సోమవారం 421 మంది నైపుణ్యతలేని కూలీలు హాజరైనట్లు ఆయన తెలిపారు. కూలీలకు దినసరి కూలీ రూ.250 ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కొలతల ప్రామాణికతను పరిగణలోనికి తీసుకొని వేతనం చెల్లించనున్నట్లు ఆయన వివరించారు. కూలీలు ఉదయం ఆరు గంటల నుండి రెండు గంటల వరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు.

పత్తికి మద్దతు ధర కోసం కదంతొక్కిన రైతులు

- జిల్లా కేంద్రంలో బంద్ సంపూర్ణం
- రాస్తారోకోతో మూడు గంటల పాటు ట్రాఫిక్ జామ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్‌తో వివిధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ సోమవారం జిల్లా కేంద్రంలో విజయవంతమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రానికి తరలివచ్చి బందుకు మద్దతు పలికారు. ఎంతో కష్టనష్టాలు కోర్చి పంట పండించుకుంటే చేతికి వచ్చేనాటికి మద్దతు ధర లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సంఘాల పిలుపు మేరకు రైతులు వందలాదిగా తరళివచ్చారు. ఉదయం నుంచి జిల్లా కేంద్రంలో బంద్ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం, బీసీ రైతు సంఘం అధ్యక్షులు వైరగడే మారుతి, బంజారా నాయకులు బానోత్ గోపాల్ నాయక్, వివిధ సంఘాల నాయకులు బోర్కుటే తిరుపతి, సోయం చిన్నయ్య, చాపిడి సురేష్, రమేష్, ప్రభాకర్, బిక్కాజీ, మిట్ట పోషన్న, నాగపురి మారుతి, ఆవిడపు ప్రణయ్ పాల్గొన్నారు. ఉదయం నుంచి వివిధ సంఘాల నాయకులు, రైతులు జిల్లా కేంద్రంలో కలియ తిరుగుతూ దుకాణాలు మూయించారు. వ్యాపారస్తులు సైతం రైతులకు మద్దతుగా స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల వరకు కూడా మెడికల్ దుకాణాల మినహా ఎటువంటి దుకాణాలు తెరుచుకోలేదు.

మూడు గంటలపాటు ట్రాఫిక్ జామ్

పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని డిమాండ్‌తో రైతులు చేపట్టిన బంద్‌లో భాగంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద వివిధ సంఘాల నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఇదే సందర్భంలో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా బైపాస్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్ళించడంతో విషయం తెలుసుకున్న రైతులు స్థానిక పెద్దవాగు బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. దీంతో మూడు గంటల పాటు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ధర్నాతో పలువురు ప్రయాణికులు ఇబ్బంది పడ్డప్పటికీ, రైతుల డిమాండ్ ముందు ఇబ్బంది చిన్నదేనని వారు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో డిఆర్ఓ రాజేశ్వర్ అక్కడికి చేరుకొని నాయకులకు సర్ది చెప్పడానికి ప్రయత్నించినప్పటికీ వారు వినకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది. దీనితో ఏఆర్ ఏఎస్పి భీమ్ రావ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాణా ప్రతాప్ నేతృత్వంలో పోలీసులు రైతులను రోడ్డుపై నుండి బలవంతంగా తీసుకువచ్చి ప్రత్యేక బస్సులో స్టేషన్ తరళించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టు ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని భవిష్యత్తులో మరింత ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.



ఆసిఫాబాద్‌లో రహదారిపై బైటాయించిన రైతులు

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

వాంకిడి : పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని హైదరాబాద్-నాగ్‌పూర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై సోమవారం రైతు హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు జయరాం మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ధరను కల్పించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పత్తి క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు రైతుల బాధలను వివరించినా ఎవరూ స్పందించడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతు హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు మెంగాజీ మాట్లాడుతూ రైతుల కోసం ఏ ప్రజానాయకుడు కానీ, అధికారులు కానీ స్పందించకపోవడంతోనే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందన్నారు. హామీలను ఇప్పటివరకు నెరవేర్చడం లేదని, రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని రైతు సంఘాలతో పాటు ఇతర ప్రజా సంఘాలతో కలిసి ప్రణాళిక తయారుచేసి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ రహీమొద్దీన్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి, సుచిత్, విలాస్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో బంద్‌తో నిర్మానుష్యంగా కూడలి





వాంకిడిలో రైతుల రాస్తారోకో

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే శాఖా పరమైన చర్యలు

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కవిత అన్నారు. సోమవారం స్థానిక ఐబీ ప్రాంతంలో కబ్జాదారులు అక్రమంగా పాతిన ఫెన్సింగ్ పోళ్లను ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారు ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. తాండూర్ శివారులోని సర్వేనెంబర్ 732, 73, 734లోని నాలుగు ఎకరాల 39 గుంటల భూమిని రెవెన్యూ శాఖ ఇరిగేషన్ శాఖకు కేటాయించిందని తెలిపారు. అట్టి భూమిలో ఇరిగేషన్ అధికారులు రూ.6 లక్షల వ్యయంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసినప్పటికీ కబ్జాదారులు కబ్జాకు ప్రయత్నించగా వారించామని తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కేటాయించిన భూమిని పూర్తి హక్కులు పొందేలా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇరిగేషన్ అధికారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకున్నట్లయితే కేటాయించిన భూమిని వేరే శాఖకు కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల కోరిక మేరకు మండలంలో జూనియర్ కళాశాల జ్యోతిబాపూలే పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలంగా ఎంపిక చేయనున్నట్లు ఆమె వివరించారు. ఆమె వెంట ఎజాజోద్దీన్, రెవెన్యూ సిబ్బంది వేణు దిగంబర్ ఉన్నారు.

అగ్నిమాపక సాధనాల పనితీరుపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనుల విభాగాల అధికారులతో అగ్నిమాపక సాధనాల పనితీరుపై శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి తన కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అన్ని విభాగాల, గనుల అధికారులను, ఆయా విభాగాల, గనులలో అగ్నిమాపక సాధనముల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ మధ్యకాలంలో రామగుండంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంను గురించి చర్చించి ఇటువంటి ప్రమాదాలు శ్రీరాంపూర్ ఏరియాలో జరగకుండా ఉండడానికి తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి అందరికీ అవగాహన కల్పించి, రక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ త్యాగరాజు, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, ఏరియా వర్క్ షాపు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ఉపరితల, భూగర్భ గనుల ప్రాజెక్ట్ ఇంజనీర్లు, పిట్ ఇంజనీర్లు, సేఫ్టీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సూపర్‌లగ్జరీ బస్సు బోల్తా ప్రయాణికులకు స్వల్ప గాయాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిపో నుంచి ఉదయం 6 గంటలకు హైదరాబాద్ వెళుతున్న సూపర్‌లగ్జరీ బస్సు మార్కండేయ గుడి వద్దకు వెళ్లగానే ఎడమవైపు బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ డిపోకు చెందిన టీఎస్ 20 జెడ్ 0015 నెంబర్ గల బస్సు ఆసిఫాబాద్ దాటగానే డ్రైవర్ సదేశ్ తన డోర్ వేసుకునే ప్రయత్నంలో చాతిలో నొప్పి రావడంతో సీట్‌లో నుండి జారి కింద పడిపోయాడు. బస్సు నడుస్తూ ఉండడంతో ఎడమవైపు హైవే రహదారి కోసం తవ్విన బొందలో బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణికులకు కండక్టర్ శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్ఎం జానీరెడ్డి, డిఎం శ్రీధర్‌లు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని స్థానిక ఆస్పత్రికి తరళించారు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఘనంగా జడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మీ జన్మదిన వేడుకలను కార్యకర్తల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, ఎంపీపీ పెందూర్ మోతీరాం జడ్పీ చైర్‌పర్సన్‌తో కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ కార్యకర్తలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్ బయన బాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, ఉప సర్పంచ్ నిసార్ అహ్మద్, నాయకులు ఇనూస్, రఘునాథ్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

నవతెలంగాణ ఆసిఫాబాద్

క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని క్రీడాకారులు క్రీడ స్ఫూర్తి కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎంపీపీ మండల్ స్పోర్ట్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు. మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో నెలకొన్న క్రీడ నైపుణ్యాలు బయటపడతాయని అన్నారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఎంపీపీ కప్ ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని ఆటల పోటీలతో విద్యార్థులలో స్నేహభావం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, ఎంపీపీ మల్లికార్జున్ గిరిజన సంక్షమ అధికారిని, జిల్లా క్రీడల అభివద్ధి అధికారి మణెమ్మ ఎంఈఓ మనుకుమార్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ సజీవన్, బీఆర్ఎస్ నాయకులు మునీర్, నిసార్, తాజ్, గోపాల్ నాయక్, సుంకరి పెంటయ్య, ప్రెసిడెంట్ అహేమద్ బిన్ అబ్దుల్లా, ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు రాధాకృష్ణ చారి పాల్గొన్నారు.

8న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న బుధవారం ఉదయం 11:00 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.నాగేశ్వర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కావాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఫ్యాక్టరీ తెరిపించాలని కార్మికుల నిరసన

కలెక్టర్ కార్యాలయంలో వినతి

నవతెలంగాణ-మంచిర్యాల



శాలివాహన బయోమాస్ పవర్ ప్లాంట్‌ను మరో పది సంవత్సరాలు పవర్ పర్చేస్ అగ్రిమెంట్(పీపీఏ) పొడిగించాలని కోరుతూ సోమవారం కార్మికులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. బీఎంఎస్, సీఐటీయూ కార్మిక సంఘాల అద్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత ధర్నా చేపట్టి కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. కార్మిక సంఘం అధ్యక్షులు కుంటాల శంకర్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి గత మూడు నెలలు గడుస్తున్నా పీపీఏ పొడిగించక పోవడంతో కార్మికుల కుటుంబాలు బయాందోళనకు గురౌతున్నారని అన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి ప్రభుత్వానికి నివేదిక పంపించి శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్‌కు మరో పది సంవత్సరాల పాటు పీపీఏ పొడిగించి కార్మికుల జీవితాలు రోడ్డున పడకుండా కాపాడాలని కోరారు. కార్మిక నాయకులు చెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కంపెనీలో 200 మంది కార్మికులు పరోక్షంగా మరో 300 మంది కార్మికులు ఆధారపడి కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని, మధ్యంతరంగా కంపనీ మూసివేస్తే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. సీఐటీయూ నాయకులు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ ఈ సమస్యను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పవర్ ప్లాంట్‌కు పీపీఏను పొడిగించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, మూడు సంవత్సరాల బోనస్‌లు ఇప్పించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశించి పవర్ ప్లాంట్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘము జనరల్ సెక్రటరీ ఎన్.సత్యనారాయణ, అసరి రాజయ్య, ఎస్.ఆనందరావు, ఎస్.తిరుపతి, శంకర్, కార్మిక సంఘం సీనియర్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, డి.మల్లయ్య,పెంట సత్యం, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక పోరాటం చేపడతాం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్

నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల సింగరేణి ప్రైవేటీకరణ దిశగా పయనిస్తుందని, ఇది ఇలాగే కొనసాగితే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, సింగరేణి ప్రైవేటీకరణ కాకుండా దీర్ఘకాలిక ఉద్యమాలు చేపడతామని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని సమావేశాల్లో ఎవరు ప్రశ్నించడం లేదని ఆరోపించారు. ఎంఎండీఆర్ యాక్ట్ ప్రకారం భవిష్యత్తులో ఉన్నటువంటి బొగ్గు గనులు ప్రవేట్, మల్టీ నేషనల్ కంపెనీలకు అప్పగించన్నుట్టు పేర్కొన్నారు. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. అలాగే రామగుండం బెల్లంపల్లి రీజియన్‌లో సిమెంట్ ఫ్యాక్టరీలు పెట్టాలని, థర్మల్ విద్యుత్తు కాకుండా 3000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను పెట్టాలని సీఎండీని కలిసి మెమొరండాన్ని ఇచ్చామని తెలిపారు. పర్సనల్, లా డిపార్ట్మెంట్లను పటిష్టం చేసి సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని పేర్కొన్నారు. పదవీ విరమణ కాలం ఐదు సంవత్సరాలు ఉండగానే మెడికల్ బోర్డుకు అనుమతి ఇవ్వాలని, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో నాణ్యమైన మందులు ఇవ్వడం లేదని, నాణ్యత గల మందులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, ఏరియా నాయకులు గరిగే స్వామి, సమ్మ రాజయ్య, పెట్టెం శ్రీనివాస్, కాంపల్లి రామయ్య, జీవన్ రావు, రవిశంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళల స్వయం నిర్ణయ అధికారానికి పోరాడుదాం

- పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల స్వయం నిర్ణయ అధికార స్వేచ్ఛ కోసం పోరాటం చేద్దామని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "మహిళల స్వయం నిర్ణయ అధికారం స్వేచ్ఛకై పోరాడుదాం" అనే అంశం మీద నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకాశంలో సగం అంటున్న మహిళలను నేటికీ వంటింటికి పరిమితం చేస్తున్నారని అన్నారు. ఇల్లు పిల్లలు బాధ్యత లాంటివి స్త్రీలు చూడడం వల్ల పరిస్థితి ఇలా తయారయిందన్నారు. స్త్రీలు స్వేచ్ఛగా జీవించడానికి ఆటంకంగా ఉన్న మనువాద మత చాందసాన్ని వెనక్కి నెట్టి అనేక చట్టాలను సాధించుకోవడం ద్వారా అన్ని రంగాల్లో ఎదగడానికి అవకాశం ఏర్పడింది కానీ ఈ అవకాశాలు అందుకోవడం అనేది స్త్రీలందరికీ సాధ్యం కావడం లేదన్నారు. అనేక రూపాలలో ఆటంకాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచి స్త్రీలు స్వయం నిర్ణయాధికారం స్వేచ్ఛకు పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు ముస్కె జ్యోతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి వేముల వైష్ణవి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్రవ్యాప్తంగా సెలవు ప్రకటించాలని కోరారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు జిల్లాకు రూ.మూడు లక్షలు కేటాయించాలని అన్నారు. గిరిజన బందును అమలు చేయాలని, గిరిజనుల విద్య అభివృద్ధికి గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇస్తున్న రూ.3 లక్షలకు బదులు రూ.10 లక్షలు కేటాయించాలని సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్నికోరారు. అనంతరం ఏఓ సురేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోతు మల్లేష్ నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ జ్యోతిబాయ్, రాష్ట్ర కార్యదర్శి బానోత్ సరోజ బాయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గజానంద్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్, భుక్య రాజు నాయక్, భుక్య శ్రీనివాస్ నాయక్, ప్రవీణ్ నాయక్, దేవేందర్ నాయక్ శంకర్ నాయక్, గణేష్ నాయక్, భుక్య సురేష్, వెంకటేష్, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.



పత్తికి మద్దతు ధర రూ.15వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

పత్తికి మద్దతు ధర రూ.15000 ఇవ్వాలని మంచిర్యాల జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు, కొండ గుర్ల లింగన్న అన్నారు. సోమవారం మండలంలోని ధర్మారం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వక రైతులను మోసం చేస్తున్నాయన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అన్ని గ్రామాల్లో పత్తి పండించిన రైతులు పత్తిని గిట్టుబాటు ధర లేక ఇండ్లలోనే ఉంచుకున్నారన్నారు. రైతుల వద్ద నుంచి దళారులు పత్తిని కొనుగోలు చేసిన తర్వాత ప్రభుత్వం మద్దతు ధర పెంచితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు క్వింటాలుకు రూ.15000 మద్దతు ధర ఇచ్చి కత్తి రైతులను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు, మాసం రాజన్న, ప్రధాన కార్యదర్శి దుర్గం దుర్గయ్య, దుర్గం పోచయ్య బాలయ్య, రాజన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోజువారీ పన్నులు సకాలంలో వసూలు చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మేజర్ జిపిలలో రోజువారీ పన్నులతో పాటు ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని డిపిఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంద్రవెల్లి జిపిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. క్యాష్ బుక్, పన్నుల వసూళ్ల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల వారిగా సకాలంలో పన్నులు వసూలు చేయకపోవడంతో బిల్ కలెక్టర్‌ను నిలదీశారు. అదేవిధంగా మండలంలో చేపడుతున్న అనధికార ప్లాట్ల కొనుగోలు, ఇండ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. 1/70 చట్టానికి విరుద్ధంగా నిర్మాణాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ తరపున ఎలాంటి ఇండ్ల నెంబర్‌లను కేటాయించకూడదని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓ సంజీవ్‌రావ్, గంగారాం, ఇద్రిస్, ఎంపిఓ సంతోష్ ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

మంగళవారం 07 జనవరి 2023

108లో ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - జైనూర్

ఈఎంఆర్ఐ హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108 వాహనంలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్మామెట్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంటీ, పైలెట్ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈఎంటీ ఉద్యోగం కోసం కనీసం డిగ్రీలో బీఎస్‌సీ నర్సింగ్, ఫార్మసీ అర్హత కలిగి ఉండాలన్నారు. పైలెట్ కోసం కనీసం 10వ తరగతి చదివిన వారికి ప్రత్యేక ట్రైనింగ్ ఇస్తామన్నారు. ఈ నెల 9న కాగజ్‌నగర్‌లోని 108 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన వారికి ఈ నెల 13 నుండి 60 రోజుల పాటు ట్రైనింగ్ ఇస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9705609823 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హాత్ సే హాత్ జోడో యాత్రను ఆదరించాలి

- కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



నవతెలంగాణ-మంచిర్యాల

హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కోకిరాల సురేఖ కోరారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని తిలక్‌నగర్‌లో హాథ్ సే హాత్ జోడో యాత్రను ఆమె ప్రారంభించారు. పార్టీ జెండాను ఎగరవేసిన అనంతరం పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ విజయాలు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ జోడోయాత్రకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ హాత్ సే హాత్ జోడో యాత్ర రెండు నెలలపాటు పాదయాత్ర గా కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత పాల్గొన్నారు.

నస్పూర్ : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద హాత్ సే హాత్ జోడో యాత్రను సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. ముందుగా కార్నర్ లోని రాజీవ్ గాంధీ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. 22వ వార్డులో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రాహుల్ గాంధీ జోడోయాత్రకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

వేమనపల్లి : ఏఐసీసీ పిలుపు మేరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్‌అలీ ప్రారంభించారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశాన్ని ఐక్యం చేసేందుకు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో పాదయాత్ర ముగింపు సందర్భంగా దానిని కొనసాగింపుగా ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశానుసారం రాహుల్ గాంధీ సందేశం గడప గడపకు తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకకులు డీసీసీ సభ్యులు తోకల రాంచందర్, తొకల వెంకటేశం, కుబిడే నానేష్, ఇగురం జగన్, శ్రీనివాస్, రమేష్, గోపాల్, ముల్కల్ల సత్యనారాయణ, కుమ్మరి శ్రీనివాస్, అల్లూరి కిరణ్, దుర్గం తిరుపతి, కాంపెల్లీ శేఖర్ పాల్గొన్నారు.

జన్నారం : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెబుతారని కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభుదాస్, ఫసిఉల్లా అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దుమాల రమేష్, ప్రచార కార్యదర్శి ఎండీ అజహర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మామిడిపెల్లి ఇందయ్య, బొంతల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్, ప్రవీణ్, ప్రశాంత్ ఎన్ఎస్‌యూఐ నాయకులు అజ్మాత్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట్ : కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్ అన్నారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఇంద్రవెల్లి జనగర్జన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మున్సిపాలిటీలో 5,12 వార్డుల్లో హత్ సే హత్ జోడో యాత్రకు మద్దతుగా కోక్కి రాల సురేఖ-ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో గడప గడప కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి వెళ్లి అభివద్ధి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు యండీ ఆరిఫ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అన్యాయాలు, అక్రమాలను ప్రజలకు వివరించడం కోసమే ఈ 'హత్ సే హత్ జోడో'యాత్ర అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, ఎంపీపీ అన్నం మంగ చిన్నన్న పాల్గొన్నారు.

కాసిపేట : మండలలో హత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ ప్రారంభించారు. సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజి అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, మెరుగు పద్మశంకర్, ఆదివాసీ నాయకులు కనకరాజు, ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, ఓరియంట్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు అన్నం కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోలేటి స్వామి, సీనియర్ నాయకులు ఏనుగు జనార్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు షాకీర్, మైదం రమేష్, గాదం గట్టయ్య, జంగిలి రమేష్, మహేష్, వార్డు సభ్యులు కొత్త రమేష్, పంబాల తిరుపతి, మల్లెత్తుల రాజేశం, జయరాం, పురె పోషం, విజయ్, ప్రేమ్ పాల్గొన్నారు.









కరెంట్ కోసం రోడ్డెక్కిన రైతులు

- బీజేపీ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ముట్టడి

నవతెలంగాణ-భైంసా



వ్యవసాయ రంగానికి విద్యుత్తు కోతలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనలు చేపట్టారు. బిజెపి నాయకులు రామారావు పటేల్ నేతృత్వంలో ఆందోళనలకు భారీ సంఖ్యలో రైతులు కదం తొక్కారు. నిర్మల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో ఇరువైపుల పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అక్కడి నుంచి ర్యాలీగా 132/11 కేవీ సబ్‌స్టేషన్‌కు వెళ్లి కార్యాలయాన్ని ముట్టడించారు. బీఆర్ఎస్ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి నియోజకవర్గ నాయకులు రామారావు పటేల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు వ్యవసాయ రంగానికి 24గంటలు కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెప్పడమే కానీ కనీసం 5గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కరెంటును నమ్ముకొని రైతులు రబీలో పంటలు సాగు చేశారని, ఇప్పుడు కరెంటు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. పంటలకు వేళాపాళలేని కరెంటు కోతలతో పంటలకు సరిగ్గా నీరందడం లేదన్నారు. చేతికందే దశలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతర కరెంటు సరఫరా చేయని యెడల ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఆందోళనలో జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపల్లి గంగాధర్, సీనియర్ నాయకుల రవి పాండే, గోపాల్ సర్డా, నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఎంపీపీ ఆప్కా గజ్జారాం, నగేష్, రాజన్న, కళ్యాణి, గజేందర్. జిల్లా కార్యదర్శి భూమేష్, నాయకులు రాకేష్, మహేందర్‌రెడ్డి, సంతోష్, పోతన్న, కుంటాల మండల పరిషత్ ఉపాధ్యక్షులు నవీన్, సర్పంచ్ సాయన్న, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ముధోల్ మాజీ సర్పంచ్ అనిల్, ధర్మపురి శ్రీనివాస్, కిష్టారెడ్డి, సాయినాథ్, బిద్దూరి రమేష్ పలువురు రైతులు పాల్గొన్నారు.

మోడీ హయాంలో ప్రభుత్వ సంస్థలు ప్రయివేట్‌పరం

ఇండెన్స్ బర్గ్ నివేదికలు బహిర్గతం చేయాలి : కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వరంగ సంస్థలను మోడీ హయాంలోని బిజెపి ప్రభుత్వం తన గుజరాతి వ్యాపార మిత్రులైన ఆదాని, అంబానీలకు తాకట్టు పెట్టారని జిలా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా పట్టణంలోని ప్రధాన ఎస్బీఐ బ్యాంక్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఐసి, ఎస్బీఐ లాంటి ప్రభుత్వరంగ సంస్థల సొమ్మును ఎలాంటి పూచీకత్తు లేకుండా గౌతమ్ ఆదానికి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. షేర్ మార్కెట్లో షేర్ చేయడానికి ఎవరు సహకరించారో హిండెన్స్ బర్గ్ తన నివేదికల్లో స్పష్టం చేశారన్నారు. హిండెన్స్ బర్గ్ నివేదికలను బహిర్గతం చేసి గౌతమ్ ఆదాపై జాయింట్ పార్లమెంటరీ యాక్షన్ కమిటీ వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన బాధ్యత పార్లమెంట్, కేంద్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐసిసి మెంబర్ డాక్టర్ నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమూద్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఓబీసీ సెల్ చైర్మన్ అంబకంటి అశోక్, ఎస్టీ సెల్ చైర్మన్ ఆనంద్‌రావ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చరణ్‌గౌడ్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అర్బత్‌ఖాన్, పట్టణ ఉపాధ్యక్షుడు సమీర్ పాల్గొన్నారు.

నేతకాని సంఘం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో నేతకాని మహార్ కుల హక్కుల పరిరక్షణ సంఘం మండల, గ్రామ కమిటీ, మహిళా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులు పొట్టాల నాగరాజు, మహిళా అధ్యక్షురాలు కామెర అనూష, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి శ్రావణి, జిల్లా ఉపాధ్యాక్షురాలు అక్కెపల్లి ప్రేమలత, మండల అధ్యక్షుడు దుర్గం మహేందర్, ప్రధాన కార్యదర్శి దాగం రాజలింగు ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించి నియామక పత్రాలను అందించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గం సంజీవ్, వైస్ ప్రెసిడెంట్లుగా సోదారి సురేశ్, కుమ్మరి శేఖర్, సహాయ కార్యదర్శులుగా దుర్గం ప్రేంకుమార్, దుర్గం ప్రశాంత్, పబ్లిక్ సెక్రెటరీలుగా ముడిమడుగుల రామారావు. గోలేటి శషి, దుర్గం శేఖర్, కోశాధికారిగా దుర్గం రామయ్య, మండల మహిళా అధ్యక్షురాలిగా అక్కెపల్లి తిరుమల, జనరల్ సెక్రెటరీగా జాడి పోసక్క, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోదారి ఈశ్వరిలత, ఉపాధ్యాక్షురాళ్లుగా దుర్గం సుమలత, జాడి మౌనిక, సహాయ కార్యదర్శులుగా సల్లూరి సునీత, దుర్గం శ్రీదేవి, సుమలత, పబ్లిక్ సెక్రెటరీలుగా దుర్గం లక్ష్మీ, జాడి శైలజ, దుర్గం కవిత, కోశాధికారినిగా రత్నం వెంకటమ్మ, చింతగూడెం గ్రామ మహిళా అధ్యక్షరాలిగా చిరకుంట శంకరమ్మ, సోమగూడెం(కె) గ్రామ అధ్యక్షులుగా లాట్కూరి ప్రకాష్‌ను నియమించారు.

ఘనంగా కోవ లక్ష్మి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - జైనూర్

జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కోవ లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ కోవ అరుణ, అధ్యక్షుడు కోవ సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎస్పీ సురేష్‌కుమార్, అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ సుధాకర్ నాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ హైమద్, కొడప హన్నూపటేల్, జైనూర్, సిర్పూర్(యు), కెరమెరి, రెబ్బెన, వాంకిడి మండలాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీపీలతో కలిసి ఉచిత వైద్యశిబిరం ప్రారంభించారు. 12 రకాల ప్రత్యేక వైద్యులు జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రత్యేక వ్యాధులకు అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుండి మూడు మండలాలకు చెందిన గిరిజనులు, పేదలు భారీ ఎత్తున రావడంతో వైద్యులు వారికి సాయంత్రం వరకు పరీక్షలు చేశారు.



50 కిలోల కేక్‌తో..

జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జన్మదిన వేడుకలకు రెబ్బెన మండలానికి చెందిన కోవ లక్ష్మి అభిమాని సుమారు 50కిలోల కేక్‌ను తీసుకొచ్చారు. ప్రత్యేక వేదికలో జన్మదిన వేడుకల కోసం వచ్చిన వారితో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, కెరమెరి, వాంకిడి, రెబ్బెన, ఆసిఫాబాద్, నార్నూర్, గాదిగూడ మండలాల నుండి మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అభిమానులు, యువజన సంఘం నాయకులు, అధికారులు చైర్‌పర్సన్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుమ్ర తిరుమల, ఎంపీడీఓ ప్రభుదయ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్, నేతకాని రాష్ట్ర కన్వీనర్ జాడి రవీందర్, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్ యాదవ్, సయ్యద్ అబ్దుల్‌కలాం, మండల పార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, మండల కోఆప్షన్ సభ్యులు అఫ్రోజ్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఎంపీటీసీలు కుమ్ర భగవంత్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ వినతి

మంచిర్యాల: విద్యారంగంలో నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొల్ల రామన్న, గుర్రాల రాజవేణు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాషా పండితులు, పీఇటీల ప్రమోషన్లు కల్పించాలని, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీతోపాటు అక్రమ బదిలీల రద్దు చేపట్టాలని అన్నారు. సీనియార్టీలో తప్పులను సవరించి పారదర్శకంగా బదిలీలు సాగేలా చూడాలని కోరారు.

గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన

నవతెలంగాణ-తలమడుగు



ఖోడద్ గ్రామ పంచాయితీ రికార్డులను సోమవారం శిక్షణ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. గ్రామపంచాయతీ నిధులు, అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిధులు అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని గ్రామ సర్పంచ్, మండల అధికారులకు సూచించారు. ఆమె వెంట సర్పంచ్ సాకి ఆనంద్, ఎంపీడీఓ రమాకాంత్, ఎంపీఓ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వాణి ఉన్నారు.

పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - జైనూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం మండల విద్యాధికారి కుడిమెత సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్ పరిధిలో గల ప్రతి పాఠశాలలో పిల్లల కోసం ఆధార్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఆధార్‌కార్డులో సవరణలున్న వాటిని ఈ కేంద్రం ద్వారా సరిచేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీనికోసం ప్రభుత్వం నుండి ఆపరేటర్‌ని నియమించామన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్ కనక ఆనంద్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదులలో విభాగంలో అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజావాణిలో 15 దరఖాస్తులు వచ్చాయని, వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్‌లు అందుబాటులో ఉండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్జీదారుని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల్లో పరిష్కారం కాని సమస్యలను జిల్లాలో పరిష్కారం కొరకు ప్రజావాణిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు హేమంత్ బోర్కడే, రాంబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మల్కేపల్లిలో కంటి వెలుగు శిబిరం

నవతెలంగాణ- కాసిపేట

మండలంలోని మల్కేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరం కొనసాగింది. గ్రామస్తులు శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపాడ్‌లో విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని గుండ్లపాడ్ గ్రామానికి చెందిన పెంద్రం అంకిత(16) ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ గంగారాం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..పెంద్రం కిషన్ పెద్ద కూతురు అంకిత ఆసిఫాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేదని ఇంటి వద్దనే ఉంటుంది. హాస్టల్‌కు వెళ్లి మంచిగా చదువుకోవాలని కుటుంబీకులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వెళ్లటం ఇష్టం లేని విద్యార్థిని రాత్రి సమయంలో ఇంటి ముందు గదిలోని దూలానికి ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అథ్లెటిక్స్ విభాగంలో బాలురు, బాలికల కోసం అంతర్ జిల్లా ఎస్ఐడీజేఏయం పోటీలు ఈ నెల 10, 11, 12న పాట్నాలో జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుండి పాల్గొననున్న క్రీడాకారులకు ఆదిలాబాద్ ఏడీసీసీ బ్యాంక్ తరపున ట్రాక్ సూట్లను అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాక్ సూట్ అందించిన ఏడిసిసి బ్యాంక్ వారికి అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిసిసి బ్యాంక్ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, జీఎం అనుపమ, మేనేజర్ చంద్రశేఖర్, పేటా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, కోచ్ విజిఎస్ రాకేష్, పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగా జీవితాల పెంపు



నవతెలంగాణ-జైపూర్

అనేక పోరాటాల ఫలితంగా జీతాలు పెంచుకున్నామని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్వరి అన్నారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి విజయోత్సవం జరుపుకున్నారు. పోరాటాలకు స్పందించి ప్రభుత్వం రూ.3వేలకు జీతం పెంచడం సంతోషకరమన్నారు. ఇంతటితో ఆగకుండా పిఎఫ్ ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కోసం మరిన్ని పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి, సిఐటియు చెన్నూర్ పట్టణ కార్యదర్శి బోడంకి చందు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి కరీమా, సభ్యులు అమీనా, సమ్మక్క, పూసక్క, విజయ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాను సందర్శించిన సింగరేణి సంచాలకులు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాను నూతనంగా సింగరేణి సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన ఎన్‌వీకె శ్రీనివాస్(డైరెక్టర్ ఆపరేషన్), జి వెంకటేశ్వర్‌రెడ్డి(డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) సందర్శించారు. ముందుగా ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ వారికి పూలమొక్కను అందించి శాలువాతో సత్కరించి, స్వాగతం పలికారు. అనంతరం జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాలులో బెల్లంపల్లి ఏరియాలో వివిధ విభాగాధిపతులతో కలిసి ఏరియా స్థితిగతులను వారికి వివరించారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టు, త్వరలో ప్రారంభం కానున్న గోలేటి ఓసీపీని సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా, ఖైరిగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్ ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, బెల్లంపల్లి ఏరియాలోని విభాగాధిపతులు పాల్గొన్నారు.

భాషా పండిత్, పీఇటీలకు ప్రమోషన్లు కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భాష పండిత్, పీఇటీలకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలోనే బాషా పండిత్, పిఈటిలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పేట్కులే, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక పొచ్చన్న, సోమ శ్యామ్‌సుందర్, శ్యాంసుందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ సాంబన్న, జావిద్ అలీ, జిల్లా పెటా ప్రధాన కార్యదర్శి ఎస్. స్వామి, వినాయక రావు, సంగీత, పుష్పలత, శంకర్ పాల్గొన్నారు.